నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, గురువారం 20 జూన్ 2024 | MAHABUBNAGAR NARAYANPET




గద్వాలలోని పీజీ కేంద్రం ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య

# నీట్ రద్దు చేయాలి

గద్వాల రూరల్, జూన్ 19 : నీట్ పరీక్షను తక్షణమే రద్దు చేయాలని బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పీజీ సెంటర్ వద్ద నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ, రేవంత్‌రెడ్డి తక్షణమే విద్యార్థులకు క్షమాపణ చెప్పాలన్నారు. నీట్ అవకతవకల్లో సీఎం రేవంత్‌రెడ్డి హస్తం ఉన్నట్లు భావిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి స్పందించకపోతే వారి కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పాలనలో కాలేజీలను అధికం చేయడం వల్లనే సీట్ల సంఖ్య పెరిగిందన్నారు. రాష్ట్రంలో నీట్ పరీక్ష రాసిన దాదాపు 75వేల మంది గురించి సీఎం ఆలోచించడం లేదన్నారు. అదేవిధంగా కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహదేవ్, రామకృష్ణ, వీరాంజనేయ, నవీన్, రాముడు, విజయ్‌తోపాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### 'సుప్రీం' జడ్జితో విచారణ జరిపించాలి



పేటలో ఆందోళన నిర్వహిస్తున్న విద్యార్థులు

నారాయణపేట, జూన్ 19 : నీట్ లీకేజీపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సత్యనారాయణ చౌరస్తాలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ యూజీ ప్రవేశ పరీక్షలో అవకతవకలు జరిగాయని దేశవ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో అనుమానాలు నెలకొన్నాయన్నారు. ఈ విషయంపై కేంద్రం ఇప్పటివరకు స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ ఎన్‌టీఏ చైర్మన్ ప్రదీప్‌కుమార్ జోషి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షను రాష్ట్రాల పరిధిలోకి మార్చి కోచింగ్ సెంటర్ల పేరుతో పేపర్ లీకేజీలు చేస్తున్న సెంటర్ల అనుమతులు రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి గౌస్, కోశాధికారి వెంకటేశ్, జిల్లా నాయకులు ప్రసాద్, మహేశ్, నరేశ్, అనిల్, పవిత్ర, నవనీత, కవిత తదితరులు పాల్గొన్నారు.

# దేశ రక్షణలో భాగస్వాములు కావాలి




వనపర్తి డిగ్రీ కళాశాలలో అగ్నివీర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కల్నల్ సందీప్

- అగ్నివీర్‌ను యువత సద్వినియోగం చేసుకోవాలి
- వాయుసేన రీసోర్స్ పర్సన్ కల్నల్ వీ సందీప్

వనపర్తి, జూన్ 19 (నమస్తే తెలంగాణ) : దేశ రక్షణతోపాటు మంచి భవిష్యత్ కోసం యువత అగ్నివీర్‌ను సద్వినియోగం చేసుకోవాలని వాయుసేన రీసోర్స్ పర్సన్, కల్నల్ వి.సందీప్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లాలోని డిగ్రీ కళాశాల ఆడిటోరియం హాల్‌లో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన అగ్నివీర్ అవగాహన సదస్సులో కల్నల్ పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17-21 ఏండ్ల వయస్సు ఉన్న యువతీ యువకులు అగ్నివీర్‌లో చేరి దేశ రక్షణలో భాగస్వాములు కావాలన్నారు. ఇందులో వాయుసేన, నేవీ, ఆర్మీ అనే మూడు విభాగాలుంటాయని, ఎంపికైన రోజు నుంచి ప్రారంభంలోనే నెలకు రూ.30వేల వేతనం ఉంటుందన్నారు. ఆరు నెలలు శిక్షణ అనంతరం మూడేండ్ల ఆరు నెలలు సర్వీస్ చేయాల్సి ఉంటుందన్నారు. అగ్నివీర్‌లు సాయుధ దళంలో విశిష్టమైన ర్యాంకును కలిగి ఉంటారని, వ్యవధి పూర్తయిన తర్వాత ఇతర రంగాల్లో ఉపాధి కోసం క్రమశిక్షణ, చైతన్యవంతమైన, ప్రేరేపిత మరియు నైపుణ్యం కలిగిన వర్క్ ఫోర్స్‌గా సమాజంలోకి వెళ్లవచ్చన్నారు. నాలుగేండ్ల తర్వాత అగ్నివీర్‌లకు రూ.11.71 లక్షల సేవానిధి ఇస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ దేశ రక్షణలో సైనికులుగా కొంతకాలం పనిచేసేందుకుగానూ అగ్నివీర్‌ను ప్రవేశపెట్టినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారి టి.సుధీర్‌కుమార్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి ధాం సింగ్, జిల్లా సమాచారశాఖ అధికారి సీతారాం, ఉమ, ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రంగసముద్రానికి నీటి విడుదల



రంగసముద్రం రిజర్వాయర్‌కు వెళ్తున్న నీటికి పూజలు చేస్తున్న రైతులు

పెబ్బేరు, జూన్ 19 : భీమా ఎత్తిపోతల పథకంలో భాగమైన శ్రీరంగాపురం రంగసముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు బుధవారం సాగునీరు విడుదలైంది. కొత్తకోట మండలం అమడబాకుల వద్దనున్న ఎనుకుంట రిజర్వాయర్ నుంచి 15వ ప్యాకేజీ కాల్వ ద్వారా అధికారులు నీటిని విడుదల చేశారు. కృష్ణా బేసిన్‌లో అక్కడక్కడా వర్షాలు కురవడంతో రంగసముద్రానికి సాగునీటిని విడుదల చేసినట్లు భీమా ఈఈ కేశవరావు తెలిపారు. రిజర్వాయర్ పరిధిలోని చెరువులు, కుంటలను సైతం నింపే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఐదురోజుల పాటు నీటిని విడుదల చేసి రంగసముద్రాన్ని నింపుతామన్నారు. రంగసముద్రానికి సాగునీరు విడుదల కావడంతో ఆయకట్టు రైతులు కాల్వకు పూజలు చేశారు. భీమా ఎత్తిపోతల పథకంలో భాగంగా శ్రీరంగనాథ ఆలయానికి ఆనుకొని నిర్మించిన రంగసముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పరిధిలో 20వేల ఎకరాల ఆయకట్టు సాగవుతున్నది.

# యోగా శిక్షణలో మెరిసిన సుగుణ




సుగుణను అభినందిస్తున్న అంతర్జాతీయ యోగాభ్యాసకురాలు మరియం, మహ్మద్ మార్క్స్

వనపర్తి, జూన్ 19 (నమస్తే తెలంగాణ) : పంజాబ్ రాష్ట్రం పటియాలలో నిర్వహించిన యోగా శిక్షణలో వనపర్తికి చెందిన దండు సుగుణ ప్రథమస్థానంలో నిలిచిందని యోగాసన జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రావు, ప్రధాన కార్యదర్శి కృపాకర్ పేర్కొన్నారు. ఈనెల 10 నుంచి 18వ తేదీ వరకు నేతాజీ సుభాష్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారని వారు తెలిపారు. ఈ శిక్షణలో పాల్గొన్న యువతకు స్పోర్ట్స్‌లో ఉద్యోగ అవకాశాలుంటాయని, దేశ, రాష్ట్ర అంతర్జాతీయ అవార్డులు కూడా పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో టాంజానియా ఆఫ్రికన్ కాంటినెంట్ నుంచి వచ్చిన గెస్ట్, రిసోర్స్ పర్సన్ మరియం మహ్మద్ మార్క్స్ యోగా ప్రాధాన్యతను వివరించారన్నారు. యోగా వల్ల అనారోగ్య సమస్యలను దూరం చేయవచ్చని, సుదీర్ఘకాలంగా అనారోగ్యం తో బాధపడేవారు సైతం యోగాతో ఆరోగ్యవంతులుగా మారవచ్చని శ్రీధర్‌రావు పేర్కొన్నారు. కాగా పటియాలలో జరిగిన యోగా శిక్షణలో ప్రథమ స్థానంలో నిలిచిన సుగుణను అధ్యక్ష, కార్యదర్శులు అభినందించారు. 2036లో భారత్‌లో యోగాసన ఒలింపిక్స్ జరుగనున్నాయని ఆయన తెలిపారు.

# నిబంధనలకు విరుద్ధంగా..

- అచ్చంపేట శ్రీచైతన్య స్కూల్‌లో పాఠ్యపుస్తకాల విక్రయం
- సీజ్ చేసిన ఎంఈవో



పుస్తకాల విక్రయ కేంద్రాన్ని సీజ్ చేస్తున్న ఎంఈవో


అచ్చంపేట టౌన్, జూన్ 19 : అచ్చంపేట పట్టణంలోని శ్రీచైతన్య స్కూల్‌లో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎంఈవో రామారావు బుధవారం స్కూల్‌కు వెళ్లి పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్న కేంద్రాన్ని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలను విక్రయించడం విరుద్ధమని, నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో ఆందోళన చేపట్టారని ఆయన తెలిపారు.

# కరెంట్ కట్ కట!

- తెలంగాణలో మళ్లా ఎన్కటి రోజులు
- ఉమ్మడి జిల్లాలో ఇష్టమొచ్చినట్లు కరెంట్ కోతలు
- పొలాలకు నీరు పారించేందుకు బోర్ల వద్ద జాగరణ
- పవర్ ప్రాబ్లంతో యాసంగి సీజన్‌కు దెబ్బ
- తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సాగు సంబురం
- కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆగమైన అన్నదాత
- కేసీఆర్ ప్రభుత్వమే బాగుండే.. అంటున్న రైతులు
- ఉమ్మడి జిల్లాలో విద్యుత్ సరఫరాపై ఆగ్రహం

*కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ అంతటా గృహ, వ్యవసాయ రంగంలో నిరంతరం విద్యుత్ వెలుగులు విరజిమ్మాయి. కానీ కాంగ్రెస్ పాలనలో కరెంట్ కట్‌కటతో రైతన్నలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. మళ్లా ఎన్కటి రోజులు దాపురించాయని దుమ్మెత్తిపోస్తున్నారు. పవర్ ప్రాబ్లంతో ఇప్పటికే యాసంగి పంటల సీజన్ దెబ్బ తినగా.. సాగునీరు సక్రమంగా లేదు.. విత్తనాలు విత్తినా వరుణుడి కరుణ లేదు.. బోర్ల కింద సాగైన పంటలకు నీళ్లు పెడుదామంటే కరెంట్ సక్రమంగా ఉండదు.. రాత్రిళ్లు జాగరణ తప్పడం లేదని వాపోయారు. ఉమ్మడి జిల్లాలో విద్యుత్ సరఫరాపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. నాటి బీఆర్‌ఎస్ సర్కారే బాగుండే అని గుర్తు చేసుకుంటున్నారు. నాడు ధగధగ లాడితే.. నేడు కరెంట్ కోతలతో అల్లాడుతుండడంపై మండిపడుతున్నారు. తెలంగాణను వెలుగుల దివ్వెగా మార్చిన కేసీఆర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం నిలదీయడం సరికాదంటున్నారు.*

*- మహబూబ్‌నగర్, జూన్ 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*



### చేతులెత్తేశారు..!

అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నమ్మి రైతులు మోసపోయారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఆదుకుంటుందని భావించినా ఇందుకు విరుద్ధంగా రైతుల నడ్డి విరిచే చర్యలు ప్రారంభమయ్యాయి. వచ్చిన మూడు నెలలకే యాసంగి పంటకు విద్యుత్ సరఫరా చేయలేక కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసింది. పంటలన్నీ ఎండిపోయాయి. పండిన కాస్త పంటను కూడా కొనలేని పరిస్థితి దాపురించింది. రైతు భరోసా పేరుతో ఇచ్చిన హామీ అటకెక్కింది. 2014 ముందు పరిస్థితులు దాపురించాయి. కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో.. తెలియని పరిస్థితి మళ్లీ తలెత్తింది. రైతులకు ఆసరాగా నిలిచి.. నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా చేస్తే.. అందులో కేసీఆర్ గోల్‌మాల్ అంటూ దోషిగా చిత్రీకరించే ప్రయత్నాన్ని ప్రభుత్వం చేస్తుండడంతో రైతులు ఖండిస్తున్నారు. ఇది తీవ్రమైన చర్య అంటూ గొంతెత్తి నినదిస్తున్నారు. నారుమళ్లు వేసి ఇలా కరెంట్ స్విచ్ ఆన్ చేస్తే.. అలా కరెం ట్ పోతుందని.. రోజుల తరబడి నీళ్లను పారిం చే దుస్థితి నెలకొన్నదని అన్నదాతలు వాపోతున్నారు. మళ్లీ పాత రోజులు వచ్చాయని లబోదిబోమంటున్నారు. నాటి కేసీఆర్ ప్రభుత్వాన్ని పలువురు గుర్తుకు తెచ్చుకుంటున్నారు.

ఎన్కటి రోజులు మళ్లా దాపురించాయి. పదేండ్ల కింద కరెంట్ కోసం పొలాల వద్ద రైతులు జాగరణలు చేస్తూ నిరీక్షించేవారు. విద్యుత్ ఎప్పుడొస్తదో.. ఎప్పుడు పోతుందో తెలియని అయోమయ పరిస్థితుల్లో రైతులు నానా పాట్లు పడుతున్నారు. వ్యవసాయం దండగ అంటూ ఒకరు.. 9 గంటల విద్యుత్ ఇస్తామని ఆర్భాటపు ప్రకటనలు మంత్రులు, ఎమ్మెల్యేలు గుప్పిస్తున్నా.. అప్పుడప్పుడు వచ్చే కరెంట్ కోసం రైతుల దీనావస్థలు పడుతున్నారు. 2014 ముందు ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతంలో ఇదే పరిస్థితి. పంటలు పండక.. ఉన్న ఊళ్లో ఉపాధి కరువై వ్యవసాయ కూలీలంతా పొట్టగూటి కోసం ఇతర నగరాలు, పట్టణాలకు వలసపోయారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ సీఎం అయ్యాక పదేండ్లపాటు వ్యవసాయ రంగాన్ని పండుగలా మార్చారు. 24 గంటల ఉచిత కరెంట్ అందించి మూడు పంటలు పుష్కలంగా పండేలా చేశారు. బీడు భూములు సైతం సాగు బడిలోకి వచ్చేలా చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో వలసలు నిలిచిపోయి రికార్డు స్థాయిలో పంటలు సాగయ్యాయి. ఇతర రాష్ట్రాల నుంచి మన జిల్లాకే వలస వచ్చే పరిస్థితులు ఏర్పడ్డాయి. కానీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో మళ్లీ ఆ పాత రోజులు దాపురించాయి. కొత్త ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు గాకముందే ముఖ్యంగా వ్యవసాయ రంగం కుదేలైంది. వచ్చిన మూడు నెలలకి యాసంగి పంటకు కరెంట్ లేక వేలాది ఎకరాలు ఎండిపోయాయి. కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసే నాథుడు లేక రైతులు పడిన అవస్థలు వర్ణణాతీతం. కరెంట్ పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. పదేళ్లపాటు రైతంగానికి నిరంతర విద్యుత్ అందించిన కేసీఆర్‌పై నిందలు వేస్తుంటే ఉమ్మడి జిల్లా రైతులు భరించలేకపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ చర్యలను ముక్తకంఠంతో ఖండిస్తున్నారు. కర్షకులను మంచిగా చూసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై నిందలు వేయడం సరికాదని అంటున్నారు. మళ్లీ పాత రోజులు దాపురించాయని,.. రైతులను కాంగ్రెస్ వాళ్లు ఆదుకునే అవకాశాలే కల్పించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### వ్యవసాయ బావుల వద్ద జాగరణే..

ఉమ్మడి రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు రైతులను పట్టించుకున్న దాఖలాల్లేవు. ఒకరు వ్యవసాయం దండగ అంటే మరొకరు పండగ అంటూ ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకున్నారు. 2014 కంటే ముందు కరెంట్ ఎప్పుడు వస్తదో.. ఎప్పుడు పోతదో తెలియని తికమక పరిస్థితులు ఉండేవి. కరెంట్ కోసం వ్యవసాయ బావుల వద్ద రైతులు జాగరణ చేసేవారు. తెలుగుదేశం హయాంలో 7 గంటల కరెంట్ ఎటు సరిపోక పంటను కాపాడుకోలేక రైతుల అవస్థలు చెప్పలేనివి. ఆ తర్వాత వచ్చిన వైఎస్ వ్యవసాయాన్ని పండగ చేస్తా అంటూ 7 గంటల కరెంట్‌ను 9 గంటలకు పెంచి ఉచిత విద్యుత్ అందించారు. కానీ నిర్ణీత సమయంలో అప్పుడో గంట.. ఇప్పుడు రెండు గంటలు అన్నట్లు కరెంట్ సరఫరా అయ్యేది. దీంతో అర్ధరాత్రి 12 గంటల తర్వాత వచ్చే కరెంట్ కోసం భార్యాపిల్లల్ని వదిలి ఎక్కడో ఉన్న పొలాలకు పరుగులు తీసేవారు. ఒకేసారి విద్యుత్ వాడడంతో లోడ్‌తో మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయేవి. బతుకు జీవుడా అంటూ ఉమ్మడి జిల్లాలో ఏటా 14 లక్షల మంది వలసలు వెళ్లేటోళ్లు. బంగారు పంటలు పండే భూములు ఉన్నప్పటికీ తినడానికి తిండి లేక రైతులే కూలీలుగా మారి మహా నగరాలకు వలస బాట పట్టిన దుస్థితి నాటిది. మోటర్లు ఆన్ చేసేందుకు వెళ్లి ఎందరో విద్యుదాఘాతానికి గురై.. మరి కొందరు చీకట్లో పాము కాటుకు గురై ఎందరో మృతి చెందారు. వీటన్నింటిని అధిగమిస్తే పంటలు పండక.. దిగుబడి రాక రైతులు ఆత్మహత్య చేసుకునేటోళ్లు.. ప్రభుత్వాలు రైతులను చిన్న చూపు చూడడంతో వ్యవసాయం అంటేనే భయపడే పరిస్థితికి వచ్చింది.

### తెలంగాణ ఏర్పడ్డాక వ్యవసాయ రంగం కొత్తపుంతలు

ఉమ్మడి రాష్ట్రంలో నిధులు, నియామకాలు, నీళ్ల కోసం గోసపడ్డ తెలంగాణ స్వరాష్ట్ర సాధనతో.. కేసీఆర్ ప్రభుత్వంలో కల నెరవేరింది. ముందుగా రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయించి.. అందుకు తగ్గట్టుగానే పక్కా ప్రణాళికతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముందుకెళ్లింది. రైతాంగానికి చేయూతనివ్వడంతోపాటు అనుబంధ రంగాలను కూడా ప్రోత్సహించడంతో నిరంతర విద్యుత్ అందించడం సాధ్యమైంది. ఎన్నో వ్యయ ప్రయాసాలకోర్చి నాణ్యమైన విద్యుత్‌ను 24 గంటలపాటు అందించింది. ఉచిత విద్యుత్, సాగునీరు పుష్కలం కావడంతో ఎరువులు, విత్తనాలు కొరత లేకుండా చూశారు. దీంతో వ్యవసాయం పండుగలా మారింది. మాటలే కాదు.. కేసీఆర్ ప్రభుత్వం చేతల్లోనూ చూపించింది. దీంతో రైతులకు రాత్రిళ్లు జాగరణ తప్పింది. ఇంటి నుంచి సెల్‌ఫోన్‌లో ఎక్కడో ఉన్న పొలం వద్ద ఉన్న మోటర్‌ను ఆన్.. ఆఫ్ చేసే టెక్నాలజీని అందుకున్నారు. స్విచ్ ఆన్ చేస్తే బోర్‌లో ఉన్న జలం పంట పొలాలను తడిపేది. బీడు భూములు సైతం పంట పొలాలతో సస్యశ్యామలంగా మారాయి. ఎకరా ధర రూ.ఐదారు లక్షలు పలకని భూములు సైతం ఏకంగా రూ.కోటికి ఎగబాకింది. దీంతో వలసలన్నీ వాపస్ వచ్చాయి. గ్రామాలు, గిరిజనన తండాల్లో రైతుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. పూరిళ్లు మాయమై డాబా ఇండ్లు వెలిశాయి. మరోవైపు తాగునీటికి కూడా ఇబ్బందులు లేకుండా చేయడంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొన్నది. ఉచిత విద్యుత్ అనుబంధ రంగాల మద్దతుతో రైతులు లక్షాధికారులు అయ్యారు. పంట దిగుబడులు పెరగడంతో ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. దీనికి తోడు కేసీఆర్ ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించేందుకు రైతుబంధు పథకాన్ని తీసుకొచ్చింది. దీంతో రైతుల అప్పులు మాయమై మరింత ఉత్సాహంగా వ్యవసాయాన్ని అందిపుచ్చుకున్నారు.

### కరెంట్ సక్కగ ఇస్తలేరు..

కాంగ్రెసోళ్లు ఇంత బాధపెడుతున్నరు.. కరెంట్ సక్కగ ఇస్తలేరు.. తుకాలు పెట్టుకుందామంటే కరెంట్ లేక సన్నబోరు మూడు దినాల సంది నీళ్లు పోస్తలేదు. యాసంగిలో కూడా పంటలన్నీ ఎండిపోయినయ్. ఉన్న కొంచెం పంటను అమ్ముకుందామంటే వడ్లను కొనేటోళ్లే లేరు. రైతుల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఇది ఏం గవర్నమెంటో ఏమో.. కేసీఆర్ ఉన్నప్పుడు బాగుండే.. కరెంట్ లేక శానా ఇబ్బందులు పడుతున్నాం.



*- కుమ్మరి నారాయణ, రైతు, కోటకదిర, మహబూబ్‌నగర్ రూరల్ మండలం*

### మళ్లీ పాత రోజులొచ్చినయ్..

రైతులు సంతోషంగా లేరు. తెలంగాణ రాకముందు ఎట్లుండెనో ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఉంది. ఇటు కాలం బాలేదు.. అటు కరెంట్ బాలేదు.. పంటలు చేతికొచ్చే పరిస్థితి అస్సలు కనిపిస్తలేదు. కేసీఆర్ హయాంలో రైతులు 24 గంటల కరెంటు ఇస్తే.. ఇష్టం వచ్చిన పంటలు పండించినం. కాంగ్రెస్ వచ్చినంక కరెంట్‌కు మళ్లీ పాత రోజులొచ్చినయ్. ఊళ్లో ఎవరిని అడిగినా కరెంట్ ఎప్పుడు వస్తదో చెప్పలేని పరిస్థితి ఉంది.



*- కోస్గి మల్లప్ప, కోటకదిర, మహబూబ్‌నగర్ రూరల్ మండలం*

# డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

- రిలీజ్ చేసిన పీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి

పాలమూరు, జూన్ 19: పాలమూరు విశ్వవిద్యాలయం పరిధిలోని స్థానిక ఎంవీఎస్ డిగ్రీ కళాశాల యూజీ డిగ్రీ సెమిస్టర్ 2,4,6 సెమిస్టర్ రెగ్యులర్, 1,2, 3,4,5,6 సెమిస్టర్ బ్యాగ్‌లాగ్ ఫలితాలు బుధవా రం కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి ఆధ్వర్యంలో పీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి విడుదల చేశారు. ఈ ఫలితాలలో రెండో సెమిస్టర్‌లో 919 మందికి, 355 మంది విద్యార్థులు, నాలుగో సెమిస్టర్‌లో 935 మంది విద్యార్థులకు 489మంది విద్యార్థులు, ఆరో సెమిస్టర్‌లో 919మంది విద్యార్థులకు 812 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అయితే ద్యార్థులు ఫలితాలను ఎంవీఎస్ డిగ్రీ కళాశాల వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.కార్యక్రమంలో పీయూ పరీక్షల నియంత్రణ అధికారి రాజ్‌కుమార్, స్పెషల్ ఆఫీసర్ నాగభూషణం, అడిషనల్ కంట్రోలర్ శాంతిప్రియ, విజయ, ఎంవీఎస్ వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణగౌడ్, ఈశ్వరయ్య, రాములు, హరి, ప్రసాద్, మల్లికార్జున్, సూర్యనారాయణ, తిరుపతయ్య పాల్గొన్నారు.



డిగ్రీ ఫలితాలు విడుదల చేస్తున్న పీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి

# మనకల నిజం పుస్తకావిష్కరణ

- తనను సాహిత్యం వైపు నడిపించడంలో బాల్‌రాం ఒకరు : నిరంజన్‌రెడ్డి



మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి వ్యాసాల సంపుటిని ఆవిష్కరిస్తున్న వక్తలు

తెలుగు యూనివర్సిటీ, జూన్ 19 : సమాజ అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడుతున్న నాగవరపు బాల్‌రాం అరుదైన వ్యక్తుల్లో ఒకరని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రశంసించారు. సీఎన్‌ఆర్ విద్యార్థులు నాగర్‌కర్నూల్ ఆధ్వర్యంలో ఆబిడ్స్ తిలక్‌రోడ్డులో ఉన్న తెలంగాణ సారస్వత పరిషత్తు హాలులో బుధవారం సాయంత్రం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వ్యాసాల సంపుటి మన కల నిజం పుస్తకావిష్కరణ సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చింతపల్లి నిర్మలాదేవి-నారాయణరావుల పేరిట నెలకొల్పిన జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రముఖ సాహితీవేత్త నాగవరం బాల్‌రాంకు ప్రదానం చేసి సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రసంగిస్తూ తనను సాహిత్యం వైపు నడిపించిన వారిలో బాల్‌రాం ఒకరని ఆయన పేర్కొన్నా రు. గత పదేండ్ల కాలంలో వివిధ పత్రికలకు తాను రాసి న వ్యాసాలను మన కల నిజం పేరుతో పుస్తకరూపంలో తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. టీజీపీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ప్రసంగిస్తూ గత పదేండ్లలో వనపర్తి నియోజకవర్గం అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన నిరంజన్‌రెడ్డి భవిష్యత్‌కు బాటలు వేశారన్నారు. కార్యక్రమంలో మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, దక్కన్ ల్యాండ్ పత్రిక ఎడిటర్ ఎం వేదకుమార్, సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, సాహితీవేత్తలు కోట్ల వెంకటేశ్వర్ రెడ్డి, చింతలపల్లి భాస్కరరావు, ప్రొఫెసర్ సీతారాం, వనపట్ల సుబ్బయ్య, కిషన్‌రావు, డాక్టర్ భూపేష్‌కుమార్, కొల్లాపురం విమల తదితరులు పాల్గొన్నారు.